క్లుప్తంగా

ఉద్యోగ విరమణ సన్మానం



ఫాతిమాను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నేరేడుచర్ల : మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సబార్డినేట్‌గా 16 ఏళ్ల పాటు సేవలందించిన లకుమల్ల ఫాతిమా ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో ఫాతిమాను ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పూర్ణ విజయ, అనసూర్య, శౌరి, నర్సింహారావు, వెంకటేశ్వర్‌రావు, రషీద్‌ఖాన్, రామమూర్తి, కుటుంబసభ్యులు ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా సూరిబాబు



చిలుకూరు : ఎమ్మార్పీఎస్ చిలుకూరు మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన మల్లెపంగు సూరిబాబు ఎన్నికయ్యారు. బుధవారం రాత్రి చిలుకూరు మండల కేంద్రంలో జరిగిన ఎమ్మార్పీఎస్ నాయకుల సమావేశంలో సురిబాబును వరుసగా మూడోసారి మండల అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ గ్రామ అధ్యక్షుల ఎన్నిక

నడిగూడెం : మండలంలోని వల్లాపురంలో గురువారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ సమావేశం మండల ఇన్‌చార్జ్ యలమర్తి రాము అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాలను ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ గ్రామశాఖ అధ్యక్షుడిగా కిన్నెర రఘుపతి, ఎంఎస్పీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా నూకపంగు నాగేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మొలుగూరి సైదులు, ఎంఎస్పీ మండల అధ్యక్షుడు మిట్టగణుపుల మోష, ఎంఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ పందిటి నవీన్‌కుమార్, వీహెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు నూకపంగు గుర్వయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దివ్యాంగులకు పెన్షన్ పెంచాలని వినతి

హుజూర్‌నగర్ : గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ దివ్యాంగులకు ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ రూ.4 వేల నుంచి రూ.6 వేలకు పెంచాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం హుజూర్‌నగర్‌లోని ఆర్‌డీఓ కార్యాలయం డీఏఓ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్లలో 5 శాతం వికలాంగులకు కేటాయిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. నాయకులు పిచ్చయ్య, పుల్లయ్య, శ్రీను, నరసింహరావు, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మట్టి నమూనాల సేకరణ



ప్రకృతి వ్యవసాయం చేస్తున్న భూమిలో మట్టి నమూనాలు సేకరిస్తున్న సిబ్బంది

మునగాల : మండలంలోని ముకుందాపురం, బరాఖత్‌గూడెం గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం సాగు చేసే 120 మంది రైతుల భూముల్లో వ్యవసాయ శాఖ అధికారులు గురువారం మట్టి నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి బుంగా రాజు మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయంలో సాగు పద్ధతులు, మెళకువలపై గడ్డిపల్లి కేవీకేలో రైతులకు శిక్షణ ఇప్పించనున్నట్లు తెలిపారు. రెండు సంవత్సరాల తర్వాత రైతులకు ప్రభుత్వం నుంచి సర్టిఫికెట్ ఇప్పించనున్నట్లు తెలిపారు. వ్యవసాయ విస్తరణాధికారులు రేష్మ, నాగు, రమ్య, భవాని, రైతులు పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అప్రమత్తత అవసరం



అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

మునగాల : క్షయవ్యాధిపై అప్రమత్తత అవసరమని వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ అన్నారు. నిక్షయ్ శివిర్ అభియాన్‌లో భాగంగా మండలంలోని రేపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం క్షయవ్యాధి నివారణపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వారానికి మించి దగ్గు ఉన్నా, కళ్లె పడడం, ఛాతిలో నొప్పి, బరువు తగ్గడం, రాత్రిపూట జ్వరం రావడం, ఆకలి మందగించడం లక్షణాలు ఉంటే పీహెచ్‌సీలో వైద్యపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్ జయమ్మ, టీబీ సూపర్‌వైజర్ సుభాషిణి, టీబీ నోడల్‌పర్సన్ లింగం రామృష్ణ, జిల్లా టీబీ కోఆర్డినేటర్ బడుగు ప్రసాద్, డీఈఓ మాధవ్, ల్యాబ్ టెక్నీషియన్ ఫణీందర్, ఏఎన్‌ఎంలు బి.పద్మ, కె.పద్మ, ఆశావర్కర్లు రమణ, జ్యోతి, లక్ష్మి, నాగమ్మ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య లోపం.. సీజనల్ భయం

- వీధుల్లో నిలుస్తున్న వర్షపునీరు
- అస్తవ్యస్తంగా డ్రెయినేజీలు
- వ్యాధులు ప్రబలే అవకాశం
- గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరుతున్న జనం



అల్వాలపురంలో రోడ్డుపై నిలిచిన మురుగు నీరు



చెట్లతో నిండిపోయిన డ్రెయినేజీ

కోదాడరూరల్ : వర్షాకాలం ప్రారంభమైంది. ఈ కాలం వచ్చిందంటే సీజనల్ వ్యాధులతో ప్రజలు రోగాల బారిన పడుతుంటారు. ఇంట్లో ఒక్కరికి జ్వరం వచ్చిందంటే మిగిలిన వారికి కూడా వచ్చే అవకాశం ఉంటుంది. ప్రస్తుత వర్షాకాలంలో పారిశుద్ధ్యం లోపించడంతోనే వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. సీజనల్‌గా వచ్చే కలరా, మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతుంటాయి. సరైన సమయంలో తగు జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధుల బారి నుంచి బయట పడవచ్చు. ఇందుకు వైద్యారోగ్య శాఖ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు సమన్వయంతో ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం..

కోదాడ మండలంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. వీధుల్లో మురుగునీరు నిలుస్తోంది. డ్రెయినేజీల్లో పూడిక తీసే నాథుడు లేరు. దీంతో ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే ముగురు నీరు నిల్వకుండా ఎప్పటికపుడు డ్రెయినేజీలను శుభ్రం చేయిస్తుండాలి. డ్రెయినేజీ వెంట, ఖాళీ ప్రదేశాల్లో మురుగు నీరు నిల్వ ఉండేచోట బ్లీచింగ్ ఫౌడర్ చల్లి ఈగలు, దోమలు వ్యాప్తి చెందకుండా తగు చర్యలు తీసుకోవాలి. మంచినీటిని ట్యాంకులను శుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటాం



సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పంచాయతీరాజ్ శాఖ నుంచి ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో మురుగు నీరు నిల్వకుండా చూడాలని ఇప్పటికే పంచాయతీ సిబ్బందిని అప్రమత్తం చేశాం. ఎప్పటికప్పుడు డ్రెయినేజీలను శుభ్రం చేయడం, చెత్తచెదారం పేరుకపోకుండా తొలగించేలా పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశాం. మంచినీటి ట్యాంకులను క్లోరిన్‌తో శుభ్రం చేసేందుకు తగు చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలు కూడా తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

– పాండురంగన్న, ఎంపీఓ, కోదాడ

'మోతె'లో కలెక్టర్ పర్యటన



మామిళ్లగూడెంలోని పాఠశాలలో బియ్యాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

మోతె : మండలంలో కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ గురువారం సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులు, సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులపై పర్యవేక్షణ, రేషన్ కార్డుల వెరిఫికేషన్ ప్రక్రియపై తహసీల్దార్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం బీఎల్‌ఓల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఎల్‌ఓలకు ఓటరు జాబితాలపై పలు సూచనలు చేశారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి..

అనంతరం మోతె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు అయ్యేవిధంగా వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. డయాగ్నస్టిక్ సెంటర్, ఫార్మసీ గదిని, స్టాక్‌ను తనిఖీ చేశారు. కుక్క కాటుకు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి వచ్చిన ఎనిమిదేళ్ల చిన్నారి రక్షితతో మాట్లాడి నోట్ బుక్ అందించారు. ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం వచ్చిన వృద్ధులతో మాట్లాడారు.

పరిశీలించి.. పాఠాలు చదివించి

మోతె, మామిళ్లగూడెంలలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, విభళాపురంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను కలెక్టర్ సందర్శించారు. నిత్యావసరాల వస్తువుల స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. విభళాపురం ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి విద్యార్థులతో తెలుగు పాఠ్య పుస్తకంలో పాఠం చదివించారు. తెలుగు మంచిగా చదువుతున్నారని మెచ్చుకున్నారు. మామిళ్లగూడెం ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులతో బోర్డుపై మ్యాథ్స్ చేయించారు. మధ్యాహ్న భోజన పథకం రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ, తహసీల్దార్ ఎం.వెంకన్న, మండల వైద్యాధికారి రాజేష్, పీహెచ్‌ఎన్ జయలక్ష్మి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి



బీఎల్‌ఓలకు నిర్వహించిన శిక్షణలో మాట్లాడుతున్న ఆర్డీఓ సూర్యనారాయణ

చిలుకూరు : ఎన్నికల నిబంధనల మేరకు బూత్ లెవల్ అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ అన్నారు. ఎన్నికల నిబంధనలపై గురువారం చిలుకూరు రైతు వేదికలో బూత్ లెవల్ అధికారులకు మండల స్థాయిలో నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దని అన్నారు. ఓటర్ల జాబితా పూర్తిగా బీ ఎల్‌ఓలపై ఆధారపడి ఉందని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ధృవకుమార్, డిప్యూటీ తహసీల్దార్ కరుణ శ్రీ, సీనియర్ అసిస్టెంట్ పుష్ప, ఆర్‌ఐలు మంత్రిప్రగడ సీతారామచందర్‌రావు, శ్వేత, ఆర్‌పీ చందా శ్రీనివాస్‌రావు, బీఎల్‌ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- డీఎంహెచ్‌ఓ చంద్రశేఖర్

గరిడేపల్లి : వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ సేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, ఆస్పత్రి పరిసరాలను ఆయన పరిశీలించారు. డీఎంహెచ్‌ఓ ఆసుపత్రికి వెళ్లిన సమయంలో వైద్యాధికారి సెలవులో ఉన్నట్లు సిబ్బంది తెలిపారు. గురువారం అందించిన వైద్య సేవల వివరాలను తనకు అందించాలని ఫీల్డ్‌లో ఉన్న పీహెచ్‌ఎన్, హెల్త్ సూపర్‌వైజర్లను ఆయన ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

విద్యార్థులను మోసం చేస్తున్న ప్రభుత్వం



కోదాడలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, పీడీఎస్‌యూ నాయకులు

కోదాడరూరల్ : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఇంజనీరింగ్, పీజీ విద్యార్థులను మోసం చేస్తోందని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చందర్‌రావు, పీవైఎల్ ప్రధాన కార్యదర్శి డి.రవి ఆరోపించారు. పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం కోదాడ పట్టణంలో ఇంజనీరింగ్, పీజీ, ఫార్మసీ విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా విద్యార్థులకు రూ.7200 కోట్ల బకాయిలు విడుదల చేయకుండా వారి భవిష్యత్‌తో చెలగాటం ఆడుతుందని విమర్శించారు. ఎన్నికలకు ముందు మేనిఫెస్టోలో విద్యార్థుల సమస్యలు పరిష్కరించి వారికి అండగా ఉంటామని చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోవడం లేదని అన్నారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు ఉదయ్, పులి రాజీ, వేణు, ఉమేష్, యశ్వంత్, కల్యాణ్, రాము, రమ్య, శైలజ, స్పందన, సులోచన, సాహితి, శ్రీదేవి, విద్యార్థులు ఉన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూస్తాం

హుజూర్‌నగర్ : విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూస్తామని విద్యుత్ డీఈ వెంకట కిష్టయ్య తెలిపారు. గురువారం మండలంలోని బూరుగడ్డ సబ్ స్టేషన్‌ను ఆయన సందర్శించి కరక్కాయలగూడెం విద్యుత్ ఫీడర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ.. వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూస్తామన్నారు. ఈ ప్రాంతంలో ఓవర్ లోడ్ దృష్ట్యా రెండు ఫీడర్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దీంతో లోడ్ తగ్గి విద్యుత్ సరఫరా మెరుగవుతుందని, అంతరాయం ఉండదని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఈ నాగిరెడ్డి, ఏఈ రాంప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

'స్వచ్ఛ మున్సిపాలిటీ'కి సహకరించాలి



తడి, పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ అధికారులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ పట్టణాన్ని స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కోతి సంపత్ రెడ్డి అన్నారు. వంద రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం హుజూర్‌నగర్‌లోని 25వ వార్డులో తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపాలిటీ చెత్తబండి వచ్చినప్పుడు అందజేయాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సులువ చంద్రశేఖర్, అన్నపూర్ణ, శివశంకర్, సతీష్, సత్యనారాయణ, మహేష్, ఆర్పీలు, మెప్మా, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అణగారిన వర్గాలకు అండగా ఎమ్మార్పీఎస్



నూతన కమిటీలకు నియామకపత్రాలు అందజేస్తున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు

గరిడేపల్లి : 78 ఏళ్ల స్వాతంత్ర భారతదేశంలో 30 ఏళ్లుగా సజీవంగా నిలబడి లక్ష్యాన్ని ముద్దాడిన ఏకైక సామాజిక ఉద్యమం ఎమ్మార్పీఎస్ మాత్రమేనని, ఈ ముప్పై ఏళ్ల కాలంలో దండోరా జెండా మాదిగలకే పరిమితం కాకుండా సమస్త అణగారిన వర్గాలకు అండగా నిలిచిందని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ బచ్చలకూరి వెంకటేశ్వర్లు, ఎంఎస్పీ ఉమ్మడి నల్లగొండ ఇన్‌చార్జ్, జాతీయ కార్యదర్శి పల్లెర్ల సుధాకర్, జిల్లా అధికార ప్రతినిధి ఏపూరి రాజు అన్నారు. గురువారం ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు, మండల ఇన్‌చార్జ్ చింత వినయ్‌బాబు ఆధ్వర్యంలో గరిడేపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ గరిడేపల్లి మండల కమిటీలను ఎన్నుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. జూలై 7న మాదిగల ఆత్మగౌరవానికి ప్రతీకైన ఎమ్మార్పీఎస్ జెండా ప్రతి గ్రామంలో ఎగరాలని పిలుపునిచ్చారు. కాగా, ఎమ్మార్పీఎస్ మండల కమిటీ అధ్యక్షుడిగా కొత్తపల్లి రవి, ఉపాధ్యక్షులుగా దూర వినోద్, చిలక సైదాబాబు, చిటికెల రాహుల్, ప్రధాన కార్యదర్శిగా సతీష్, సహాయ కార్యదర్శులుగా పోలె శ్రీకాంత్, మంద శేఖర్, కుర్రి భిక్షం, ప్రచార కార్యదర్శులుగా కడప వీరస్వామి, ఆలంపల్లి శేఖర్, అధికార ప్రతినిధిగా అభిషేక్, కోఆర్డినేటర్‌గా కుర్రి వెంకన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎంఎస్పీ మండల అధ్యక్షుడిగా పోలేపల్లి రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా బుడిగ వెంకన్న, ఎంఎస్ఎఫ్ కమిటీ కన్వీనర్‌గా పోలే ప్రేమ్‌కుమార్, కోకన్వీనర్‌గా రేపూరి నాగార్జున, అధికార ప్రతినిధిగా కొత్తపల్లి పవన్‌ను ఎన్నుకున్నారు. ఎంజేఎఫ్ మండల అధ్యక్షుడిగా బరిగెల విజయ్‌మాదిగను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కోట వీరస్వామి, వెంకన్న, రాజు, ఒగ్గు విశాఖ, మల్లయ్య, అరుణ్, పిట్ట వెంకటేష్, సాయి, కిరణ్, శివ, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి సహకారం అభినందనీయం



నడిగూడెం : విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న దాతలు



గరిడేపల్లి : కల్మలచెరువులో విద్యార్థులకు బెల్టులు, టై అందజేస్తున్న ఎంఈవో చత్రునాయక్

నడిగూడెం : విద్యాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని మండల విద్యాధికారి బాజా ఉపేందర్‌రావు అన్నారు. గురువారం మండలంలోని రామాపురం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎస్‌ఆర్‌ఐ వెలిగేటి కరుణాకర్, పాలడుగు వంశీ, నందకుమార్ సహకారంతో ఆశా జ్యోతి ఫౌండేషన్ ప్రతినిధులు బ్యాగులు, నోటు బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు రామదాసు, ఉపాధ్యాయులు సుధాకర్, రాంబాబు, వీరబ్రహ్మం, శ్రీనివాసరావు, రమేష్, జీనిబేగం, విద్యార్థులు పాల్గొన్నారు.

టై, బెల్టులు అందజేత..

గరిడేపల్లి : విద్యాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని ఎంఈవో చత్రునాయక్ అన్నారు. గురువారం మండల పరిధిలోని కల్మలచెరువు గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన గుత్తికొండ కళింగరెడ్డి సహకారంతో టై, బెల్టులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చీకటి సైదులు, ఉపాధ్యాయులు రావుల రాంబాబు, సులువ శ్రీను, సీఆర్పీ అశోక్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం



పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ రాధిక

హుజూర్‌నగర్ : పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఏఎంసీ చైర్‌పర్సన్ దేశ్‌ముఖ్ రాధిక అన్నారు. గురువారం మండలంలోని బూరుగడ్డ పశువైద్యశాలలో హుజూర్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత పశువైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువులకు వ్యాధి నిరోధక టీకాలు, బలవర్ధక మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్యులు శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్లు ఎం.వెంకన్న, ఎల్.నాగేశ్వరరావు, ఏఎంసీ అధికారులు రఘుపతి రెడ్డి, ఘనీ, ప్రవీణ్, నాయకులు అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్, భిక్షం, నాగయ్య, గురవయ్య, సైదులు, వీరబాబు, గోపి, వెంకన్న, నాగరాజు, మట్టపల్లి, సతీష్, రైతులు పాల్గొన్నారు.

బీజేపీలో కష్టపడ్డవారికి పదవులు

హుజూర్‌నగర్ : పార్టీ కోసం కష్టపడ్డవారికి బీజేపీలో పదవులు దక్కుతాయని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొండ హరీష్‌గౌడ్ అన్నారు. గురువారం హుజూర్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పార్టీ సీనియర్ నాయకుడు నారపరాజు రామచందర్‌రావు ఎన్నిక కావడం హర్షణీయమన్నారు. నారపరాజు రామచంద్ర రావు నాయకత్వంలో తెలంగాణలో బీజేపీ ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని దీమా వ్యక్తం చేశారు. సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సీహెచ్.ఉమామహేశ్వరరావు, నాయకులు జి.గోపి, నాగేంద్రచారి, హరీష్, బలవంత్‌సింగ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

జన్‌ధన్ ఖాతాలు అందజేత



రేగులగడ్డ తండాలో జన్‌ధన్ ఖాతాలు అందజేస్తున్న మేనేజర్ ప్రేమ్‌కుమార్

గరిడేపల్లి : ప్రతిఒక్కరూ జన్‌ధన్ ఖాతా తీసుకోవాలని బ్యాంకు ఆఫ్ బరోడా రాయినిగూడెం బ్రాంచ్ మేనేజర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. జన సురక్ష కార్యక్రమంలో భాగంగా గురువారం గరిడేపల్లి మండలంలోని రేగులగడ్డ గ్రామంలో హుజూర్‌నగర్ మాజీ కౌన్సిలర్ పల్లి శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాయిబాబ, ఫీల్డ్ అసిస్టెంట్ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి



కోదాడరూరల్ : సమ్మె పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

హుజూర్‌నగర్ : ప్రభుత్వ కారిక్మ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఈ నెల 9న నిర్వహించతలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ అన్నారు. గురువారం హుజూర్‌నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో కార్మిక సంఘాల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వానికి అధిక పన్నులు చెల్లించే 72 శాతం సామాన్యుల్లో కార్మికులు అధిక సంఖ్యలో ఉన్నారని తెలిపారు. సామాన్యులు కట్టే పన్నులతో నడిచే ప్రభుత్వం.. జాతీయ సంపదను కార్పొరేట్ సంస్థలకు, వ్యక్తులకు కట్టబెట్టడం ఎంతవరకు న్యాయమని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లావుల రాములు, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్, యల్లావుల రమేష్, జెట్టి ప్రసాద్, మారుడి శ్రీనివాసరెడ్డి, రాఘవ రెడ్డి, ఎస్.కె హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు

సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

కోదాడరూరల్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఈ నెల 9న ఆల్‌ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేద్దామని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని లాల్ బంగ్లా ఎదుట సమ్మె పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. దేశప్రజల సంపదతో నిర్మించినటువంటి ప్రభుత్వ రంగ సంస్థలను, పరిశ్రమలను మోదీ ప్రభుత్వం ప్రైవేటీకరణ చేస్తూ కార్పొరేట్ శక్తులకు ధారదత్తం చేయాలని కుట్ర చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో అరుణోదయ జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి, ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి వి.నరసింహారావు, పోకల మైసయ్య, విజయ్, కొండయ్య, నరసింహారావు, కాశీం, శ్రీను, రవితేజ తదితరులు ఉన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

గరిడేపల్లి : ఈ నెల 9న నిర్వహించతలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు జంజనం వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండలంలోని తాళ్లమల్కాపురం గ్రామంలో భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికుల కోసం తీసుకువచ్చిన 1970 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కె పాషా, నాగుల్ మీరా, లక్ష్మి, శ్రీదేవి, స్వప్న, కళ్యాణి, సరిత, సిరి, వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.


సకల జనులు పాల్గొనాలి

హుజూర్‌నగర్ : సార్వత్రిక సమ్మెలో సకల జనులు పాల్గొని విజయవంతం చేయాలని టీఎస్‌టీయూసీ నాయకులు శీతల రోషపతి అన్నారు. గురువారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన వివిధ మహిళా సంఘాల విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకన్న, మంగమ్మ, పద్మ, చంద్రకళ, స్వరూప, నాగమణి, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

సాయిమందిరంలో అన్నదానం

మునగాల : మండల కేంద్రం శివారులోని శ్రీహరిహరసుత అయ్యప్ప దేవాలయం ఆవరణలో గల శ్రీషిర్డీ సాయిమందిరంలో బుధవారం మండల కేంద్రానికి చెందిన లంజేపల్లి అనిల్ – ఉపేంద్ర దంపతుల కుమారుడు వివేక్ పుట్టినరోజు సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సాయిమందిరం నిర్వాహకులు దేవినేని రవికుమార్, భక్తులు పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ..



కరపత్రం ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు, భక్తులు

శ్రీషిర్డీ సాయిమందిరంలో ఈనెల 10న గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని మందిరం నిర్వాహకులు రవికుమార్ తెలిపారు. బుధవారం మందిరం ఆవరణలో గురుపౌర్ణమి వేడుకల కరపత్రాన్ని భక్తులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు.

ప్రైవేటు పాఠశాల పుస్తకాలు విక్రయిస్తున్న గది సీజ్

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో ఎటువంటి అనుమతులు లేకుండా ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన పుస్తకాలు విక్రయిస్తున్న గదిని విద్యాశాఖ అధికారులు గురువారం సీజ్ చేశారు. తల్లిదండ్రుల అభ్యర్థన మేరకు బీఆర్‌ఎస్‌వీ నాయకులు రాపోలు నవీన్‌కుమార్, ఎండీ షోయబ్ ఎంఈఓ సైదానాయక్‌కు ఫిర్యాదు చేయగా ఆయన వెంటనే పుస్తకాల గదిని సీజ్ చేసి జిల్లా కలెక్టర్, డీఈఓకు సమాచారం ఇచ్చారు.

ఖాళీ పోస్టులను భర్తీచేయాలి

మునగాల : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఐద్వా మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బచ్చలకూరి మంగమ్మ, జూలకంటి విజయలక్ష్మి కోరారు. గురువారం మునగాల పీహెచ్‌సీలో వైద్యాధికారి డాక్టర్ రవీందర్‌తో ఐద్వా మండల కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పీహెచ్‌సీలో స్టాఫ్‌నర్స్, దోబీ, వాటర్‌మెన్, ఎం.ఎన్.ఓ, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు ప్రస్తుతం ఖాళీగా ఉన్నట్లు తాము గుర్తించామని, ఈ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని లేనియెడల ఐద్వా ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొమురయ్య వర్ధంతిని జయప్రదం చేయాలి

నేరేడుచర్ల : నేరేడుచర్లలో ఈనెల 4వ తేదీన నిర్వహించబోయే దొడ్డి కొమురయ్య 79వ వర్ధంతిని విజయవంతం చేయాలని సీపీఐ ఎంఎల్(మాస్‌లైన్) డివిజన్ కార్యదర్శి వాస పల్లయ్య పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో వ్యవసాయ కూలీల సంఘం జిల్లా నాయకుడు అంబటి బిక్షం తదితరులు ఉన్నారు.

రోడ్డుపై గుంత.. వానొస్తే చింత



రావిపహాడ్ బస్టాప్ వద్ద రోడ్డుపై గుంతలో నిలిచిన నీరు

మోతె : మండలంలో రావిపహాడ్‌లో బస్టాప్ నుంచి గ్రామంలోకి వెళ్లే బీటీ రోడ్డు ప్రమాదకరంగా మారింది. రోడ్డుపై గుంత ఏర్పడి వర్షపు నీరు ఆ గుంతలో నిలవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై గుంత ఏర్పడి మూడు నెలలైనా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా గ్రామంలోని పేడబండ బజార్‌లో మురుగు కాల్వ లేకపోవడంతో వర్షపునీరు వీధిలో నిలుస్తుండడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి చొరవ తీసుకొని గుంతలను పూడ్చించాలని గ్రామస్తులు కోరుతున్నారు.